క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన

వీపనగండ్ల: ఆర్టీఐ ఫోరం మండల అధ్యక్షుడిగా పుల్గర్‌చర్ల గ్రామానికి మల్లెపూల గోపాలకృష్ణను నియమించారు. నియామక పత్రాలను జిల్లా అధ్యక్షుడు రవికుమార్ చేతుల మీదుగా అందుకున్నట్లు గోపాలకృష్ణ తెలిపారు. సామాన్య ప్రజలకు సమాచార హక్కు చట్టంపై తనవంతు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

అఖిలపక్ష ఐక్యవేదిక వారోత్సవాలకు ఆహ్వానం

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలో మే 24న జరిగే ఐక్యవేదిక వారోత్సవాల ముగింపు సమావేశాలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే జయరాములు కుటుంబ సభ్యులకు, బీసీ సంఘ్, పూలే కమిటీ అధ్యక్షుడు సంగేమ్ సూర్యరావును హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ తెలిపారు. వారోత్సవాలకు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సతీష్‌యాదవ్ కోరారు.

బొడ్రాళ్ల పండుగ పోస్టర్ విడుదల



వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామంలో ఈనెల 31, జూన్ 1, 2న నిర్వహించే బొడ్రాళ్ల పండుగ సందర్భంగా గ్రామస్తులు సోమవారం గ్రామంలో పోస్టర్ విడుదల చేశారు.గ్రామస్తుల సహకారంతో పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని పెద్దలు కోరారు.

నేటి రైతు నేస్తంలో పాల్గొనండి

వీపనగండ్ల: రైతులకు వ్యవసాయ పరికరాలు, ఎరువుల వాడకం అనే అంశంపై ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పచ్చిరొట్ట ఎరువుల యాజమాన్యం అనే అంశంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం వస్తున్నందున విద్యుత్ సరఫరాలో తరుచుగా అంతరాయం కలగకుండా ఉండేందుకు వైర్ల కింద ఉన్న చెట్లను కొట్టిస్తున్నామని పేర్కొన్నారు. అందుకు గాను మండలంలోని సోళీపురం, ఉప్పరిపల్లి, మానాజీపేట, షాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్నిగ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. రైతులు, ఆయా గ్రామాల ప్రజలు అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

రాధాకృష్ణ సేవలు కాంగ్రెస్ మరువదు



వనపర్తి టౌన్: మాజీ కౌన్సిలర్, దివంగత బండారు రాధాకృష్ణ కాంగ్రెస్ అభ్యున్నతికి చేసిన సేవలను పార్టీ ఎప్పటికీ మరువదని ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం రాధాకృష్ణ ప్రథమ వర్ధంతికి హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో చీర్ల జనార్దన్‌సాగర్, ఎండీ బాబా, ఆసీఫ్ తదితరులు ఉన్నారు.

16 న వేలం నిర్వహణ

వనపర్తిటౌన్: 2025–26 సంవత్సరానికి గాను పట్టణంలోని చికెన్, మటన్, చేపల దుకాణాల నుంచి వచ్చే మాంసం వ్యర్థాలు సేకరించి పట్టణం నుంచి దూరంగా తరలించేందుకు గత నెల 29న జరగాల్సిన వేలాన్ని ఈనెల 16న కొనసాగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 16వ తేదీన ఉదయం 11గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు వనపర్తి మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఉపాధే లక్ష్యంగా ‘ఏటీసీ’ కేంద్రం

- విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు అడుగులు
- ఆధునిక, సాంకేతికతపై శిక్షణ
- ఆరు కోర్సుల్లో 172 సీట్లు



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఏటీసీ భవనం

కోర్సులు	సీట్లు	కాల వ్యవధి
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమెషిన్	40 సీట్లు	సంవత్సరం
ఇండస్ట్రియల్ రోబోటెక్స్,డిజిట్ మ్యానుఫ్యాక్చరింగ్	40	సంవత్సరం
ఆర్టీసియన్ యూజింగ్, అడ్వాన్స్‌డ్ టూల్	20	సంవత్సరం
బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్	24	రెండేళ్లు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నిషియన్	24	రెండేళ్లు
మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్	24	రెండేళ్లు

వనపర్తి రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక సంస్థ (ఐటీఐ)లను నవీకరించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలు (ఏటీసీ) సర్వం సిద్ధమవుతున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అధునాతన, సాంకేతికతపై శిక్షణకు ఆయా కేంద్రాల్లో వచ్చే విద్యా సంవత్సరం (జూన్ 2025) నుంచి తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక యువతకు డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఆరు కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. వీటిలో 172 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

రూ.4.77 కోట్లు మంజూరు

గతేడాది ఆగస్టులో జిల్లా రూ 4.77 కోట్ల నిధులతో జిల్లాకు ఏటీసీ కేంద్రం మంజూరు చేశారు. దీనికి వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంని రాజపేట శివారులో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడే కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే 40 శాతం ప్రయోగ పరికరాలు చేరాయి. భవన నిర్మాణం పూర్తయిన వెంటనే మిగతా 60 శాతం పరికరాలు బిగించనున్నారు. జిలాల్లో మొత్తం 4 ఐటీఐ కళాశాలలు ఉండగా.. ఒకటి ప్రభుత్వానిది, మూడు ప్రైవేట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. మొత్తం విద్యార్థులు 672 ఉన్నారు.

టాటా కంపెనీలోనే..



ఇండస్ట్రియల్ రోబోటెక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ కోర్సు చేస్తున్నాను. ప్రశాంత వాతవరణంలో శిక్షణ కొనసాగుతుంది. ఏటీసీ కేంద్రంలో కోర్సు పూర్తి చేశాక టాటా కంపెనీ వారు ఉద్యోగ అవకాలు కల్పిస్తారు.

– అక్షయ్‌కుమార్, విద్యార్థి

అధునాతన సాంకేతికతతో..



ఏటీసీలో ఇచ్చే ఆధునిక సాంకేతిక శిక్షణను పదో తరగతి పూర్తైన నిర్యుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. అడ్వాన్స్ టెక్నాలజీతో విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు పూర్తయిన వెంటనే వివిద కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. భవన నిర్మాణం పూర్తయితే ల్యాబ్ సౌకర్యం ఉంటుంది.

– భాస్కర్‌కుమార్, ఏటీసీ శిక్షకుడు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి..



ఏటీసీ నూతన భవనం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానుంది. ఆధునిక సాంకేతిక పరికరాలతో ల్యాబ్ సౌకర్యం ఉంటుంది. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు టాటా కంపెనీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. స్వయం ఉపాధికి దోహదపడుతుంది.

– రమేష్‌బాబు, ప్రిన్సిపాల్, ఐటీఐ కళాశాల,వనపర్తి

స్టాఫ్‌నర్సుల సేవలు మరువలేనివి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సులను సన్మానిస్తున్న డా.ప్రవళిక

వనపర్తి రూరల్: అంతర్జాతీయ స్టాఫ్‌నర్స్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవళిక సిబ్బందితో కలిసి ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు ఊర్మిళ, చరిత, బాలమణి, కేతావత్ కృష్ణ ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవళిక మాట్లాడుతూ అత్యవసర సమయంలో వారు అందించే సేవలు ఎంతో మంది ప్రాణాలు కాపాడాయని కొనియాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పార్వతమ్మ, రాజశేఖర్, తిరుపతయ్య, ఏఎస్ఎం వెంకటమ్మ, మారి, రాజేష్‌గౌడ్, విక్టర్ రాజు, సూర్యబాబు, గౌరి, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

18న బీసీ రిజర్వేషన్లపై నిరాహార దీక్ష



అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

పెద్దకొత్తపల్లి: 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న కొల్లాపూర్‌లో నిరాహార దీక్షకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సాధన సమితి రాష్ట్ర నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం సాయంత్రం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ కులాలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ జనాభాలో బీసీ వర్గాల వారే అధిక శాతంలో ఉన్నారని, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సాధన సమితి రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల సాధన కొసం గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని బీసీ కులాలన్నీ సంఘటితమై ఉద్యమించి సాధించుకోవాలన్నారు. సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు సుబ్బయ్య, భాస్కర్, ఎల్లయ్య, శ్రీనివాస్ యాదవ్, మాసయ్య, మల్లయ్య బీసీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పముల క్లస్టర్‌లో శివారు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి జానకిరాములు తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం 14 నెంబర్ల విశిష్ట సంఖ్య యూనిక్ కోడ్ కేటాయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. పంటల బీమా వ్యవసాయ యాంత్రికరణ తదితర పథకాలకు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నెంబర్ తీసుకొచ్చి వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర నమోదు చేసుకోవాలని తెలిపారు.

పింఛన్ కోసం అవస్థలు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 25 మంది వృద్ధులు ప్రతినెల పింఛన్ తెచ్చుకోవడానికి పది కిలో మీటర్ల దూరంలో వెన్నచర్ల గ్రామానికి ఆటోలో వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన 25 మంది వృద్ధులకు పింఛన్ ఇక్కడే ఇవ్వాలని వృద్ధులు పేర్కొన్నారు. వెన్నచర్ల వెళ్లి రావడానికి ఒక్కొక్కరికి రూ.100లు ఆటో ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి 25 మందికి పెద్దకొత్తపల్లి పోస్టు ఆఫీసులోనే పింఛన్ ఇచ్చేలా మార్చాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి



అడ్డాకుల: భూ భారతి చట్టం అమలు కోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మూసాపేట మండలంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజు నాయక్ కోరారు. మండలంలోని తిమ్మాపూర్, దాసర్‌పల్లి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. భూ సమస్యలపై దాసర్‌పల్లిలో 53, తిమ్మాపూర్‌లో 24 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులే గ్రామాలకు వస్తున్నారని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అందించే దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాగా, మంగళవారం సంకలమద్ది గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 7న మూసాపేటలో దరఖాస్తులు అందించిన వారు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదన్మోహన్‌గౌడ్, నాగలక్ష్మి, నాణ్యానాయక్, డీటీలు వరప్రసాద్, చంద్రశేఖర్, మాధవి, ఆర్ఐలు బాలసుబ్రహ్మణ్యం, సృజన్, అరుణ్, రవికుమార్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్



అమరచింతలో..

పాన్‌గల్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆవాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్మికులకు ఇబ్బందులు కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమ్మెకు బీజేపీ అనుబంధ సంఘం బీఎంఎస్ మినహా మిగతా అన్ని కార్మిక సంఘాలు సహకరిస్తున్నామయని తెలిపారు. సమావేశంలో భీమయ్య, రాజయ్యగౌడ్, భాస్కర్, బాలరాజుయాదవ్, ధర్మయ్య, రేణుక, అలివేలు, తిరుపతయ్య, అర్జునయ్య, కుర్మయ్య పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నందున విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)లు సోమవారం ఐకేపీ ఏపీఎం వెంకటేష్‌యాదవ్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బాలరాజుయాదవ్, రాజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత:

దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవా రం మండల కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ.26 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఈనెల 18న బైక్ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు భాస్కర్, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు ప్రభుదాస్, బీఆర్‌టీయూ జిల్లా నాయకుడు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వాలు మారినా.. బతుకులు మారట్లే’

వనపర్తి టౌన్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 ఏళ్లలో ప్రభుత్వాలు మారినవి తప్పితే ప్రజల బతుకులు మారడం లేదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయలేని ఆశలు చూపించి రాష్ట్ర ప్రజలను నిరాశకు గురి చేశాయని, చేస్తున్నాయని నిప్పులు చెరిగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ఊసే లేదని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఇప్పటికీ వరకు పేదలకు సొంత ఇంటి కల నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులు లక్షల్లో ఉంటే లబ్ధిదారులను వందల్లో ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన ప్రజా వ్యతిరేకతతో కొనసాగుతుందని, రెండూ రెండే అని ఎద్దేవా చేశారు.

పోడు రైతులకు పట్టాలివ్వాలి

కొల్లాపూర్ రూరల్: దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న ఫారెస్టు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గేమ్యానాయక్ తండాలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత 20,30 సంవత్సరాల నుంచి గిరిజన, దళిత రైతులు పోడు భూములు దున్నుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. నేటి వరకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే ప్రభుత్వం పట్టాలిచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోడు భూముల రైతులు పాల్గొన్నారు.

బైక్ చోరీ.. కేసు నమోదు



ధరూరు: మండల కేంద్రంలోని ఓ దుకాణం ఎదుట ఆపిఉన్న బైక్‌ను గుర్తు తెలియని యువకుడు దొంగిలించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్డులోని ఓ దుకాణం వద్ద అయిజకు చెందిన చాకలి వీరేష్ టీఎస్ 06 ఈజే 8725 నంబర్ గల స్పెండర్ బైక్‌ను ఈనెల 10న సాయంత్ర 5 గంటల సమయంలో ఆపి పని మీద బయటకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని యువకుడు బైక్‌ను దొంగిలించి గట్టు మండలం వైపు వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీల్లో నమోదైనట్లు పేర్కొన్నారు. బైక్ దొంగిలించిన వ్యక్తి సమాచారం తెలిపిన వారికి రూ.5వేల నగదు బహుమతి అందించనున్నట్లు సోమవారం ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 70293, 87125 25665కు తెలియజేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఇటిక్యాల: భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులే గ్రామాల్లోకి వచ్చి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. రైతులు నిర్దేశిత ప్రొఫార్మా ద్వారా దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. సదస్సులో భూరికార్డుల సవరణలు, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదా బైనామాలు, సర్వే నంబర్ గల్లంతు, పట్టాదారు పాస్‌బుక్ జారీ కాకపోవడం వంటి అంశాలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేష్, డీటీ నందిని, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి ఏర్పాటు

ఇటిక్యాల: మండల పరిధిలోని పెద్దదిన్నే వేంకటేశ్వరస్వామి దేవస్థాన నూతన పాలకమండలి సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరై కమిటీ సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని దేవస్థానాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. పాలకమండలి చైర్మన్‌గా జయసింహ, పాండురంగయ్య, ఎక్స్‌అఫిషియో మెంబర్, సభ్యులుగా వెంకటరమణ శెట్టి, నారాయణ, జయన్న, వెంకటేష్, నవిత, నాగలక్ష్మిని నియమించారు. కార్యక్రమంలో జోగుళాంబ ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలిశ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్‌చైర్మన్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



జిల్లా కేంద్రంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న సభ్యులు



చిమనగుంటపల్లిలో మాజీ మంత్రికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లి శివారులోని గుండ్ల నరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అంధించారు. స్వామివారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, శంషుద్దీన్, దామోదర్‌రావు, నారాయణ, విష్ణు, రమేష్‌నాయక్, సత్య, స్వామి, చందు, వేణు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని శంకర్‌గంజ్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కల్యాణానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ వాసవి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్‌శెట్టిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా కల్యాణం అంగరంగ వైభవంగా చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పురోహితులు బృహస్పతి శర్మ, లీలానాథ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిదంపతుల కల్యాణోత్సవం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణానికి కొత్తకోట, కానాయపల్లి, పాలెం, నిర్వేన్ గ్రామాల భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.